222068701

# ప్రబోధ 14

జగతిని జీవించువాడు మనుజుడు కావలె మొదట
దనుజుల దుష్కృతములెల్ల పొగడుచుండువాడెచవట
బ్రహ్మవిద్య నేర్చి యిచట ఆత్మతత్త్వము కనుగొనుట
రాజయోగమనకు చాటుయిది యీ సాయి చెప్పు మాట.

ప్రేమస్వరూపులారా!

ప్రపంచములో ప్రతి జీవికి జీవిత పరమార్థమంటే యేమిటో బోధపడదు. చాలామందికి బోధపడలేదనే బాధకూడను వుండదు. నూటికో కోటికో ఒకరికి యిట్టి భావము యేర్పడుతుంది. అయితే జీవిత పరమావధికి ప్రథమ సోపానము కడుపునిండ తిండి కంటినిండ నిద్ర, ఒంటినిండ దుస్తులు, యింటినిండ పిల్లలు. ఇదే పరమావధిగా భావిస్తున్నారు యువకులు. కళకళలాడే కళత్రము, తళతళలాడే వస్త్రవాహనములు యిదియే మానవజీవిత మని వారు పొంగిపోతున్నారు. ఇది కొంతవరకు నిజమే. కడుపునిండినంత మాత్రాన మనసు నిండదు. జీవితం పండదు.

కేవలం తిని వూరక వుండే స్వభావము కాదు మానవునిది. తిని తిరగాలి. తిని పని చేయాలి. ఎందుకోసం, ఎక్కడ, ఏ విధముగా నేను పని చేస్తున్నాననే విచారణ సల్పాలి. ఈ పనుల యందు మంచిని పెంచాలి. పదిమందికి పంచాలి. లౌకిక జీవితమునకు యిది పరమావధిగా భావిస్తున్నారు. కంటికి కన్పించునది, విన్పించునది, మనసుకు అన్పించునది, హృదయాన్ని మురిపించునది యీ బాహ్య ప్రపంచము. ఇది యింద్రియముల యొక్క మార్పు. ఈ యింద్రియములకు అతీతమైనది మనసు. మనసుకంటె గొప్పది బుద్ధి. బుద్ధిని నడిపించేది ఆత్మ. ఆత్మతత్త్వాన్ని గుర్తించినప్పుడే మానవత్వము సార్థకమవుతుంది.

ఇంద్రియములన్నింటికంటె, వాగింద్రియము చాలా శక్తివంతమైనది. కనుక మొట్టమొదట వాగింద్రియాన్ని అరికట్టినప్పుడు యించుమించు సర్వేంద్రియములు కూడా సాధించినవారమవుతాము. వాగింద్రియానికి తినటం త్రాగటం ప్రధాన లక్ష్యము. దీనినే ఆహార వ్యాపారమని కూడా పోలుస్తుంటారు. ఈ వాగింద్రియము యొక్క వ్యవస్థను కొంతవరకు మనము గుర్తించుకోటానికి ప్రయత్నించాలి. సర్వేంద్రియముల యొక్క వ్యాపారము కూడను వాగింద్రియములో లీనమై వుంటాయి. కనుకనే వాక్కును మనసుతో చేర్చటానికి ప్రయత్నించాలి. ఏలా వాతో మన వాక్కును సాధ్యమైనంతవరకు అదుపులో పెట్టుకోవాలి. అప్పుడే మనసు మాట్లాడటానికి ప్రయత్నిస్తుంది.

ఈమనసు మాట్లాడటానికి ప్రయత్నించినప్పుడు మనసుకు బుద్ధి చెప్పితదుపరి యీమనసును బుద్ధితో చేర్చటానికి ప్రయత్నించాలి. బుద్ధిని ఆత్మను చేర్చినప్పుడు వాగేంద్రియము మనస్సునందు, మనసు బుద్ధియందు, బుద్ధి ఆత్మయందు లీనమై సర్వతత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నిస్తుంది.

కాని లోకమునందు సామాన్య మానవులు బాహ్యజగత్తుకు అంతర్జగత్తుకు అవినావభావ సంబంధమున్నదనే సత్యాన్ని అర్థం చేసుకోలేరు. నిరంతరము బాహ్యప్రపంచమునందు భోగభాగ్యములు అనుభవించాలని ఆశిస్తున్నారేగాని అంతరింద్రియములందు ఆత్మానందము పొందుటకు ప్రయత్నం సలపటంలేదు. మానవుడు బహిర్దృష్టియే అభివృద్ధి పరచుకుంటున్నాడు గాని అంతర్దృష్టికోసం అణుమాత్రం కూడను ప్రయత్నం సలపటంలేదు. నిజమే యిదివారి దోషం కాదు. పంచేంద్రియములందు కన్నులు, చెవులు, ముక్కు, నోరు యిత్యాది ప్రధానమైన యింద్రియముల యొక్క ద్వారములు బయటవైపుకే తెరుబడివున్నందున యిందులో బయటి దృష్టి కల్గటంలో దోషములేదు. ఏకొద్దిమంది మాత్రమో అంతర్దృష్టిని అభివృద్ధి పరచుకొని ఆత్మానందాన్ని అనుభవిస్తున్నారు. అందాన్ని చూచి ఆనందించేది శరీరమా లేక ఆత్మా? ఆహారాన్ని ఆస్వాదించేది శరీరమా ఆత్మా? పరిమళానికి పరవసించేది ఆత్మనా శరీరమా? ఈవిధముగా మానవుడు పరిశోధన జరిపినప్పుడు యిది కేవలము ఆత్మ యొక్క తత్త్వమే గాని శరీరము జడమైనదనే సత్యము చక్కగా గుర్తించటానికి వలవుతుంది. మనసుకు, బుద్ధికి, యింద్రియములకు అతీతమై లోకాన్ని లాలించి పాలించేది ఆత్మతత్త్వమే అనేది అర్థం అవుతుంది. బాహ్యజగత్తుకు మూలం అంతర్జగత్తుకు ఆది ఆత్మనే. ఇట్టి మూలాధారమైన తత్వాన్ని మనం విస్మరించి క్షణభంగురమైన యింద్రియములకు లోబడి జగత్ వ్యవహారములకై మనము కాలమును వ్యర్థము చేసి జీవితాన్ని నిరర్థకం గావించుతున్నారు.

ఈనాటి విద్యలన్నీ లౌకిక విద్యలే. వేదము, వేదాంగము, సంగీత సాహిత్యములు పదార్థ విజ్ఞాన శాస్త్రములు, రసాయనిక విజ్ఞానశాస్త్రము, వృక్ష శాస్త్రము యివన్నీ కేవలం లౌకిక విద్యలే. ఈ అపర విద్యలందు మాత్రమే మన జీవితాన్ని అర్పితము చేస్తున్నాము. ఆత్మవిద్య ఒక్కటి మాత్రమే పరవిద్య. ఈ అపర విద్యలన్నీ కేవలము జీవనోపాధి నిమిత్తమై యేర్పడినవే. జీవిత పరమావధి తత్త్వమేమిటి? ఇంటినిండా వంటలు వండారంటే యీ వంటల యొక్క లక్ష్యమేమిటి? భుజించే వ్యక్తివుండినప్పుడే యీ వంటలు వండినందుకు సార్థకమౌతుంది. కనుక యీ లౌకిక విద్యలన్నీ కూడను అలౌకికమైన ఆత్మతత్వాన్ని గుర్తించు నిమిత్తము యేర్పడినవనే సత్యాన్ని యీనాడు మనము గుర్తించాలి. ఆత్మవిద్యలేకున్న యీ విద్యలన్ని నిరర్థకములు.

కనుకనే ప్రతి మానవుడు మన యొక్క జీవితము పరమలక్ష్యమేమిటి అనే ప్రశ్నను క్షణక్షణము వేసుకుంటూ వుండాలి. తినటం, త్రాగటం, నిద్రించటం, మరణించటం

222068703

యింతే నా జీవితము యొక్క గమ్యం. పశుపక్షి మృగాదులన్నీ యీనాల్గు అవస్థలను అనుభవించుచునే వున్నది. ఇంక జంతూనాం నరజన్మ దుర్లభం. అనే పదమునందు వున్న విశిష్టత యేమిటి? మానవునియందున్న వాక్కు చాలా ప్రధానమైనది. ఇది తేజోమయమైనది. మనసు అన్నమయమైనది. ఇంక ప్రాణము రసమయమైనది. తేజోమయమైన వాక్కును, అన్నమయమైన దేహమును, రసమయమైన ప్రాణముతో కూర్చటమే దీని యొక్క పరమావధి.

ఆత్మ అనగా కేవలము వాక్కు, మనసు, ప్రాణము యీ మూడింటి యొక్క సమ్మిళితమైన స్వరూపమే. ఈ బృహత్తరమైన ఆత్మతత్వాన్ని అర్థం చేసుకోటానికి కొన్ని విధములైన పరిశోధనలు చేయాలి. దీనికి మూడు అవస్థలు. జాగ్రత్, స్వప్న, సుషుప్తి. జాగ్రత అనగా యేమిటి? మనము మేలుకొని దృశ్యకల్పితమైన యీ జగత్తును చూడటం, వినటం, అనుభవించటం, మాట్లాడటం యిలాంటి పంచేంద్రియములతో కూడిన తత్వమే యీ బాహ్యజగత్తు. విశ్వతత్వానికి సూక్ష్మరూపము కనుకనే విశ్వుడు అని మరొక పేరు. ఈ విశ్వుడు యిరువది నాల్గు తత్వములతో కూడి వుంటాడు. ఐదు కర్మేంద్రియములు, ఐదు తన్మాత్రలు, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు ప్రాణములు యివి యిరవై. మనసు, బుద్ధి, చిత్తము అహంకారము యీనాల్గు అంతఃకరణములు. ఈ అన్నింటితో కూడినదే బాహ్యజగత్తు. దీనినే విశ్వుడన్నారు. ఇది జాగ్రదవస్థ యొక్క స్వరూపము.

రెండవది స్వప్నావస్థ. ఇది కేవలం కొన్ని యింద్రియములతో మాత్రమే కూడి వుండును గాని, బాహ్యమైన కర్మేంద్రియములు దీనికే మాత్రము పనికిరావు. తనకు తాను సర్వము సంకల్పింప చేసుకొని సృష్టింప చేస్తుంది. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము యీ నాల్గింటితో కూడి వుంటుంది. ఇలాంటి పరిస్థితిలో యిది తేజోమయమైన స్వరూపాన్ని ధరిస్తుంది. కనుకనే స్వప్నావస్థకు తైజసుడు అని పేరు పెట్టారు.

ఇంక కారణావస్థ - సుషుప్తి. 'సు' అనగా మంచి. షుప్తి అనగా నిద్ర. మంచి గాఢనిద్ర అని సుషుప్తికి అర్థము. ఈ గాఢ నిద్రయందు కేవలం ప్రజ్ఞ మాత్రమే మిగిలి వుంటుంది. కనుకనే సుషుప్తికి ప్రాజ్ఞుడు అని పేరు పెట్టారు.

అనగా విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడు యీ మూడు కూడను ఆత్మ యొక్క భిన్నపేర్లు మాత్రమే. కనుకనే జాగ్రదవస్థలో ఆత్మ విశ్వస్వరూపాన్ని ధరించి వుంటుంది. స్వప్నావస్థయందు తేజోమయస్వరూపాన్ని ధరించి వుంటుంది ఆత్మ. గాఢ నిద్రలో సుషుప్తియందు ప్రజ్ఞాస్వరూపాన్ని ధరిస్తుంది. కనుకనే ప్రజ్ఞానం బ్రహ్మ అని అన్నారు.

ఈ ప్రజ్ఞానమనగా యేమిటి? ఈనాడు జ్ఞానము విజ్ఞానము, సుజ్ఞానము, యనేక విధములైన జ్ఞానములు మనము తెలుసుకుంటున్నాము. జ్ఞానము, విజ్ఞానము సుజ్ఞానము, అజ్ఞానము, తలంపు, సంకల్పము, తెలివితేటలు యివన్నీ ఆత్మ యొక్క భిన్న

222068704.

భిన్నమైనపేర్లు. మనము కంటితో చూసి జగత్తని భావిస్తున్నాము. కన్ను ద్వారా అంతఃకరణ వృత్తితో వుండి యే జ్ఞానమైతే రంగులను చూస్తున్నదో అదియే ప్రజ్ఞానము. శ్రోత్రములతో ఏయొక్క జ్ఞానమైతే అంతఃకరణ వృత్తివల్ల యనేక సుశబ్దములు, దుశ్శబ్దములు వినగలుగుచున్నదో అదే ప్రజ్ఞానము. జ్ఞానేంద్రియముల ద్వారా యే జ్ఞానము అంతఃకరణ వృత్తితో యే విధమైన సుగంధములను, దుర్గంధములను అనుభవించుచున్నదో అదియే ప్రజ్ఞానము. నాలుక ద్వారా అంతఃకరణ వృత్తిలో యే యొక్క జ్ఞానము యనేక రకములైన రుచులను తెలుసుకొనుచున్నదో అదియే ప్రజ్ఞానము. దృష్టికి, శ్రవణమునకు, వాక్కుకు, వాసనకు అన్నింటికి అంతఃకరణ అనే తత్త్వమునందు యీ యొక్క ప్రజ్ఞానము అంతర్భూతమై వుంటున్నది. కన్నులు కేవలము బల్బుల వంటివి. బల్బు వున్నంత మాత్రమున మనము వెలుతురును అందుకోగల్గుచున్నామా? ఈ బల్బును ప్రకాశింపచేసేది యేమిటి? అదే కరెంటు. అదే విద్యుత్ శక్తి. కాబట్టి కన్నులు కేవలం బల్బుల వంటివే కాని దీనికి స్వత సిద్ధమైన శక్తులు గాని, స్వప్రకాశవంతమనే శక్తి గాని దీనికి లేవు. దీనికాధారము కరెంటు. అదే విధముగా చెవులు లౌడ్ స్పీకరు వంటివి. ఈ స్పీకరు వున్నంత మాత్రన మనము శబ్దమును వినగల్గుచున్నామా? దీనికి అంతఃసంబంధమైన కరెంటు వుండాలి. ఈ కరెంటు లేకపోతే శబ్దాన్ని మనం వినలేము. మైక్ లో కరెంటు లేకపోతే నా శబ్దాన్ని స్పీకరులో నీవు యేమాత్రం వినలేవు. అదే విధముగనే యీ పంచేంద్రియములన్ని కూడను జడమైనవి. ఈ జడమైన యింద్రియములను చైతన్యమయంగా మార్చేది ఆ యొక్క ప్రజ్ఞానము.

ప్రపంచమంతా పదార్థాల సమ్మిళితము. ఈ అన్నింటియందు మారనిది; త్రికాలములందు వున్నది ఒకే ఒక్కటి. అదే ఆత్మతత్త్వం. అదే ప్రజ్ఞానం. అదే బ్రహ్మ. అట్టి నిత్యమైన సత్యమైన, నిరంతరం వుండగల్గిన శక్తి ద్వారానే క్షణభంగురమైన అనిత్యమైన, అశాశ్వతమైన పదార్థములన్ని పనిచేయకల్గుతున్నాయి. పరమాత్మునికి పేరు అస్తి భాతి ప్రియం అని. అనగా సత్ చిత్ ఆనందం. సత్ అనగా being నిరంతరము వుండేది. చిత్ అనగా సర్వజ్ఞత్వాన్ని నిరూపించేది. నిరంతరము ఆనందంగా వుండేదే యీ ఆత్మతత్త్వం. యీ మూడు కూడను మారనివి. ఇలాంటి మారని తత్త్వమునకు రూపము, నామము మనము చేరుస్తున్నాము. ఈ రూపనామములు నిరంతరము మార్పు చెందునవి. అస్తి భాతి ప్రియం అనగా సత్ చిత్ ఆనందములకు రూపనామములు చేరిస్తే పంచకములవుతున్నాయి. ఈ పంచకమునకే ప్రపంచము అని పేరు పెట్టారు. అనగా Matter + Being = GOD అన్నారు. కనుక నిరంతరం వుండే తత్త్వము సర్వపదార్థములందు కూడా వుంటున్నది. నీకు తెలియకపోవచ్చును. నీవు చూడలేకపోవచ్చును. నీవు చూడకపోయినప్పటికిని అందులో ఆ శాశ్వత తత్త్వమనేది ఒకటి వున్నది. కనుక మన యింద్రియములకన్నింటికి వెనుక భాగములో చైతన్యమనేది వుండి పనిచేయుచూ వుంటుంది. ఆ ప్రజ్ఞాన తత్త్వమే లేకపోయిన మానవుడు జడమయుడు. కనుక మానవత్వమనేది దైవత్వము

తోకూడిన ఆత్మతత్త్వమనే సత్యము గుర్తించాలి.

ఒక్కొక్క అవస్థలోని అనుభూతిని మరొక అవస్థలో మనము అనుభవించలేము. స్వప్నావస్థయందు యేదో ఒక మరణాన్ని చూచి దుఃఖిస్తున్నావు. కానీ స్వప్నంలో మరణించినవారిని మిత్తమై జాగ్రత్తలో మనము యేడుస్తున్నామా. అది స్వప్నావస్థకు మాత్రమే సంబంధముగాని జాగ్రదవస్థకు అది మిథ్య. పోనీ జాగ్రదవస్తలో మరణించినవారికోసము నిద్రావస్థలో మనము దుఃఖిస్తున్నామా. అది జాగ్రదవస్తకు మాత్రమే సత్యముగాని యీ నిద్రావస్థకు అది మిథ్య. కనుకనే జాగ్రత్ స్వప్న సుషుప్తులయందున్న తత్త్వమే ఆత్మతత్త్వము. ఇది దేశకాల పరిస్థితులకే మాత్రము లొంగునది కాదు. ఇది అతీతమైన తత్త్వము. ఇట్టి ఆత్మతత్త్వాన్ని గుర్తించటమే మానవుని ప్రధాన కర్తవ్యము.

ఈ దేహమనేది భగవంతుని దేవాలయమని యీ దేవాలయం శాశ్వతమైనది స్థిరమైనది కాదు. ఇది యెప్పుడూ కదిలే దేవాలయము. ఈ దేహము యెక్కడికి వెళ్ళినప్పటికిని అక్కడ దేముడుంటాడు. నీవు మార్కెట్టుకు వెళ్ళినా, బస్సులో కూర్చున్నా, సినిమాకు వెళ్ళినా ఆఫీసుకు వెళ్ళినా ఎక్కడికి యీ దేహము తీసుకు వెళ్ళినా ఆ దేహములో దేవుడు యింటా వెంటా జంటా కంటనే వుండి నిన్ను కాపాడుతూ వస్తున్నాడు. అయితే యీ జడమైన దేహాన్ని కదిలించేది యమిటి. అందులో వున్న ప్రజ్ఞానమే. అదే దీనిని చలింప చేస్తున్నది. దానికే చైతన్యమని పేరు. ఒకచోట యినుప ముక్కలు పెట్టి మాగ్నెట్ పెడితే యినుప ముక్కలు అటూ యిటూ పరుగెడతాయి. కాని యినుప ముక్కలకు కాళ్ళు లేవే. కనుక ఈ జగత్తులో యింద్రియములన్ని యినుప ముక్కల వంటివి.

విలువలేని యినుప పెట్టె యీ దేహము
పెట్టెలోన నగలు పెట్టినట్లు
దేహమందు ఆత్మ దేవుడుండెను సుమా
సత్యమైన బాట యీ సాయి మాట.

విలువలేని యినుప పెట్టెలోపల చాలా విలువైన నగలన్నీ భద్రపరుస్తున్నాయి. పెట్టెకు విలువ లేదు కాని లోపలున్న వస్తువులకు చాలా విలువవున్నది. అదే విధముగా యీ దేహానికి విలువ లేదు కాని యీ దేహమందున్న చైతన్యము మహా విలువైనది. అలాంటి విలువైన ఆత్మతత్త్వాన్ని ప్రజ్ఞాన తత్త్వాన్ని మనం విమర్శిస్తున్నాము. విలువలేని యీ పెట్టె కోసం మనం ప్రాకులాడుతున్నాము. సర్వ నగలు అలంకరించుకోటం కోసం దేహము అత్యవసరమే. దేహమే లేకపోతే యీ నగలంతా యేమి చేస్తాము. ఎవరో తలతెంచుకొని పోతూవుంటే తలపోతే పోయింది గాని కమ్మలు, నగలు పోయినాయే అని యేడ్చాడుట ఒకడు. అదే రీతిగనే మనము ఆత్మతత్త్వమనే దానిని మనము విస్మరించి కేవలం జడమైన దేహతత్త్వాన్ని విశ్వసించి దాని నిమిత్తమై కాలమును, కర్మమును

కాయమును అంకితము చేస్తున్నాము. తనను తాను తెల్సుకోకుండా వుండినంతకాలము మానవుని దుఃఖము తప్పదు.

ఏమిటి మనకు బంధన. ఏ బంధన మనను యీ మాయలో దింపుతోంది మనకు యిల్లువాకిలి బంధము కాదు. ఆలుబిడ్డలు బంధన కాదు. ఆస్తిపాస్తులు బంధన కాదు. ఇవన్ని త్యజించాలని ప్రయత్నిస్తే తప్పక త్యజించవచ్చు. కానీ త్యజించరానిది ఒకటి వుంది. అవే రాగద్వేషములు. ఈ రాగద్వేషములతో మనం కప్పబడినంతకాలము తనను తాను గుర్తించుకోలేడు. తనస్వరూపాన్ని తాను తెలుసుకోనంతకాలము మానవునకు బంధన తప్పదు. బంధన వుండినంతవరకు బాధలు తప్పవు. ఈ బాధలే దుఃఖము. కనుక యీ దుఃఖాన్ని మనం పంపాలి. ఆనందానికి స్వాగతం చెప్పాలి. కనుక యీనాడు మనం గావించవలసినది కేవలం లౌకిక విద్యలతో మన జీవితాన్ని అర్పణగావించుకోరాదు. ఎన్ని చదువులు చదివినా యీ యొక్క ఆత్మతత్వమే గుర్తించుకోలేకపోయిన యీ చదువులన్ని కేవలం వ్యర్థమైన చదువులే.

ఎన్ని చదువులు చదివి యేమి ఫలము
తన నొసటి వ్రాత తప్పింప తరముగాదు
చెడ్డ బుద్ధులు తన తలచేరెనేని
బండబారును బుద్ధులు ఎండబారు.

మన వ్రాతను మనం తప్పించుకోవాలి. మంచి ప్రాప్తిని తెప్పించుకోవాలి. ఇదే మనం చేయవలసిన ప్రధాన కర్తవ్యము. జీవితం చాలా విలువైనది. జీవించతగినది. ఇలాంటి విలువైన పవిత్రమైన యీ జన్మను మనము నిరర్థకము గావించుకోరాదు. లౌకిక విద్యలతో పాటు ఆధ్యాత్మిక విద్యను కూడా జతచేర్చాలి. అప్పుడే మనకు ఆత్మానందం ప్రాప్తిస్తుంది. కేవలం లౌకిక విద్యలు, లౌకిక సంపాదన, లౌకిక ధనమే మనము లక్ష్యమునందుంచుకొనిన యివియే మాత్రం మన వెంట వచ్చేవి కాదు. వెంటరాని వస్తువులు మనవి కావు. మన వస్తువులైతే మన వెంట యెందుకు రావు. పుట్టే సమయంలో యింత బట్టైనా తీసుకొని రాడు. పోయే సమయంలో అడ్రస్ అయినా యిచ్చిపోడు. ఇక మన వాళ్లెట్లవుతారు వీరు. మన వస్తువులెలా అవుతాయి యివి. మనవి కానివానిని మిత్రమై మనం ప్రసులాడుతున్నాము. మనదైన విషయం మనం మర్చిపోతున్నాము.

కనుక మన తత్వం ఆత్మతత్వమే. కేవలం శాస్త్రపరిజ్ఞానము మాత్రమే ప్రధానము కాదు. ఈనాటి book knowledge, రేపు knowledge. మరునాడు allergy. కేవలం పుస్తకాన్ని మస్తకాన్ని యేకం చేసుకోటం ప్రధాన లక్ష్యం కాదు. మస్తకంలో వున్న పవిత్ర భావాలను మనము ఆచరణలో పెట్టాలి. అందువలననే Education is not only knowledge but it must be put in action. మనం ప్రయత్నపూర్వకంగా సాధనలోకి దింపాలి. మన knowledge యేమిటి? ఈనాడంతా కూడను గొప్ప knowledge వుంటుంది. గొప్ప తెలివితే

222068707

టలుకల్గిన వాడని మనం విఱ్ఱవీగుతున్నాము. తెలివితేటలంటే యేమని అర్థం చేసుకున్నారు
మీరు. ఒక పుస్తకంలో వుండే Poem మనము చదివి రెండు నిముషాలలో అది కంఠస్తం చేసుకుం
టే ఓ మంచి తెలివి తేటలనుకుంటున్నాము. ఇవి నిజమైన తెలివి తేటలు కాదు. పుస్తకంలో వున్న
దానిని మస్తకంలో చేర్చుకొని మస్తకం నుండి వాక్కు ద్వారా బయటకు చెప్తున్నాము. కాదు కాదు. చది
విన దానిలోని అంతరార్థాన్ని, అంతర్భావాన్ని మనం గ్రహించి తద్వారా మన యొక్క జీవితములో దాని
కనుగుణంగా మనం ప్రవర్తించాలి. మనం భుజించామంటే ఆ భుజించిన అన్నము లోపల చేరి
చక్కగా జీర్ణం చేసుకొని, ఆ జీర్ణింపబడిన సారము సర్వాంగములకు చేరినప్పుడే మన దేహము
పుష్టిగా సంతుష్టిగా వుంటుంది. అట్లు కాకుండా మనం భుజించినదంతా వమనం ద్వారా బయటకు
పంపిస్తే ఇంక యీ దేహానికి శక్తి యే విధముగా లభిస్తుంది. కనుక మనం యెవరో చేసిన
విషయాలంతా కూడ దానిని జ్ఞాపకం పెట్టుకొని దానినే మనం భుజించి, దానినే మనము జీర్ణిం
చుకోటానికి ప్రయత్నము చేస్తాము. ఇవి అల్పవిద్యల యొక్క లక్షణాలు. వమనం చేసిన తరువాత
దానిని తిరిగి భుజించేది కుక్కగాని మనిషి కాదు. కనుక మనం హృదయం నుండి వచ్చిన పవిత్ర
భావాలను ఆచరణలో పెట్టి సమాజానికి అందించటానికి ప్రయత్నించాలి. ఏదో పుస్తకాలలో
ని విషయాలను కంఠస్తం చేసుకొని దానినే విద్యగా భావించరాదు. ఈనాటి విద్యార్థులందరూ కూడ
ను 99% యిలాంటి పనే చేస్తున్నారు. Textbook తీసుకొని ఆ book లో వున్న విషయాన్ని చక్క
గా అర్థం చేసుకోటానికి ప్రయత్నించాలి. మొట్టమొదట అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్న
దానికొంతవరకు అనుభవంలోకి తెచ్చుకోవాలి. అప్పుడే అనుభూతి లోపల మన యిష్టం వ
చ్చిన రీతిగా దానిని మార్చుకోవచ్చును. విషయాన్ని అర్థం చేసుకోకుండా పోయినప్పుడు కేవలం
చదివిన శ్లోకము, చదివిన పదము, చదివిన వాక్యము మనం కంఠస్తం చేసుకొని దానిని పరీక్షలో
వ్రాస్తున్నారు. ఈనాడు చాలా మంది పిల్లలు Textbooks అంతా కంఠస్తము చేస్తున్నారు. Textbook
కంఠస్తం చేస్తే ప్రయోజనము లేదు. విషయాన్ని అందులో వున్న అంతర్భావాన్ని మనము చక్కగా
అర్థము చేసుకోవాలి. కనుక యిది సరైన చదువు. విద్యార్థి మొట్టమొదట విద్యను అర్థం చేసుకోవాలి.
ఈనాడు విద్యార్థి అని పేరు పెట్టుకొని విషయార్థిగా మారిపోతున్నాడు. విద్యార్థి కాలమునందు విషయా
లను యేమాత్రం కూడా మన తలలో చేర్చకూడదు. ఈ విద్య యొక్క ప్రభావమును విశాలమైన భావము
చేత సుస్థిరమైన తీర్పును మనం తీసుకోవాలి. కనుక విద్య అనగా యేమిటి. కేవలం గ్రంథములు
చదవటం చదివిన దానిని పరీక్షలో వ్రాయటం తద్వారా 'O' grade 'A' grade తెచ్చుకోటం
తిరిగి మరొకరికి చెప్పటానికి ప్రయత్నం చేయటం. ఈ విధమైన గురుశిష్య పరంపరగా పోయే
విద్య యిది ఆచరణ విద్య కానేరదు. ఇది కేవలం జీవనోపాధికై యేర్పరచుకొన్న వృత్తులు.
మన యొక్క విద్య జీవితానికే వుపయోగపడాలి. మన సమాజములో దానిని పంచాలి. ప్రవహించే
నదులకు ఆనకట్టలు కట్టి నీరు నిలువ చేస్తున్నారు. నిలువ చేసిన నీటిని కాలువల ద్వారా ప్రవ

హింపజేసి పంటలు పండించుకోవాలి. అట్లుకాకుండా కేవలం లైబ్రరీ రూమ్‌లో బీరువాలో వున్న జ్ఞానాన్ని తలలోపల నింపుకొన్నంతమాత్రాన ప్రయోజనం లేదు. కనుక బీరువాలో వున్న జ్ఞానాన్ని తలలోపల నింపుకొని, తలలో నిది మన చేతులలోనికి దింపి చేతుల ద్వారాను సమాజానికి పంచాలి. అనేకమందితో నేను గొప్ప విద్వాంసుడిని, నేను చాలా తెలివితేటలుగలవాడిని అని విఱ్ఱవీగుతున్నారు. ఇది చాలా వెఱ్ఱితనము.

ప్రతివాడు హక్కులకోసం పోరాడుతున్నాడు కాని వాని బాధ్యత యెక్కడ. రైట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీస్ ఈ రెండూ లెఫ్ట్ అండ్ రైట్‌గా పోవాలి. ఈనాడు రెస్పాన్సిబిలిటీ వుంటే రైట్ లేదు. హక్కు వుంటే రెస్పాన్సిబిలిటీ లేదు. ఈ రైట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీ రెండింటిని మనం నెగెటివ్, పాజిటివ్‌గా చేర్చుకోవాలి. నిజంగా మన బాధ్యతలు మనం సక్రమంగా నిర్వహిస్తే హక్కులు వాటంతటవే లభిస్తాయి. మన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించకుండా రైట్స్ కావాలంటే అవి యే నాటికి లభించవు. నీ కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించు. అదే నీ యొక్క రైట్ కు సరైన అర్హత.

విద్యార్థులారా! మనమీనాడు ముఖ్యంగా తెలుసుకోవలసినది లౌకిక విద్యతో పాటు ఆత్మవిద్య కూడా అత్యవసరమనే సత్యాన్ని గుర్తించాలి. మన ప్రాచీన కాలమునుండి నిత్యసత్యాలుగా ప్రకాశిస్తున్న ప్రాచీన సాంప్రదాయములను, సంస్కృతిని కాలానుగుణ్యముగా భద్రము చేసుకొని దానిని కాపాడుకుంటూ దానినే నిజమైన విద్యగా విశ్వసించాలి. మన సాంప్రదాయాలను, సంస్కృతిని మనం పోషించుకోవాలి. మన సంస్కృతి యేమిటో, మన సాంప్రదాయం అంటే యేమిటో యీనాటి విద్యార్థులకేమి అర్థంకాదు. మానవత్వానికి మకుటంధరింపజేసేదే మన సంస్కృతి. సమాజములో వున్న ఐకమత్యాన్ని అభివృద్ధిగావించుకొనేదే మన సంస్కృతి. అనేకత్వములోని యేకత్వాన్ని నిరూపింపచేసేదే మన సంస్కృతి. భిన్నాభిన్నములుగా చీలిపోయిన భావాలను యేకంగావించి సమిష్టిగా మన సంఘాన్ని అభివృద్ధిగావించటమే మన సంస్కృతి. కానీ అలాంటి unity యీనాడు నిర్మూలమైపోయింది. unity యెక్కడ లేదో అక్కడ enimity ప్రారంభమౌతుంది. ఆ enimity వల్లనే భారతదేశమంతా ముక్కలు ముక్కలుగా భిన్నాభిన్నమై పోతోంది.

మాట ఒక్కటి. సత్యం ఒక్కటి. హృదయం ఒక్కటి. హృదయము రెండు లేవు. చాలామంది హృదయమనగా గుండెగా భావిస్తున్నారు. హృదయమనగా గుండె కాదు. హృ...దయ దయతో కూడినదే హృదయము. ఆ దయనే ప్రేమ. ఆ ప్రేమనే హృదయం. కనుక హృదయం విశాలంగావించుకోమంటే భౌతికమైన Heart కాదు. Heart enlarge అయితే అది రోగంగా మారుతుంది. కనుక హృదయమనగా ప్రేమ. ఈ ప్రేమను విశాలంగావించుకోవాలి. నేను నావారనే సంకుచిత భావాలనుండి మనము మనవారు అనే గమ్యాన్ని మనము చేరుకోవాలి. ఇదే నిజమైన

222068709

హృదయవిశాలము. ఈ హృదయ విశాలమే లేనిమానవుడు సంకుచిత జీవితాన్ని గడుపుతాడు. ఇలాంటి జీవితమనేది జీవచ్ఛవంగా మారిపోతుంది. Living death. కనుక ప్రేమతత్వాన్ని పెంచుకోవాలి. దయతో మనమందరిని చూడాలి. ఒకదేశం, ఒక మానవత్వంగా మనము విశ్వసించాలి. మానవులందరూ ఒకసోదర భావం పెట్టుకున్నా అది పూర్ణత్వం కాలేదు. సోదరుల మధ్యయనే కలహాలు కల్గి సుప్రీంకోర్టువరకు పోయినవారున్నారు. కనుక brothers లోపల కూడను కొన్ని భిన్నభేదములు కల్గవచ్చును. కానీ యీనాడు మనం అభివృద్ధి పరచుకోవలసినది ఏకాత్మ భావన. అందరియందు, అన్ని జీవుల యందు, అన్ని ప్రాణుల యందు వున్నది ఆత్మ ఒక్కటే అని ఏకాత్మ భావము పెట్టుకున్నప్పుడు యెవరిని నీవు బాధపెట్టినా నిన్ను నీవు బాధపెట్టుకున్నవాడివౌతావు. ఎవరిని నీవు ఆనందపరచినా నిన్ను నీవు ఆనందపరచుకున్నవాడివౌతావు. కనుక నీవేది చేసినా, ఏది చూచినా, ఏది చెప్పినా, ఏది తలచినా అన్నినీకు నీవు చేసుకున్నవాడవే. ఈ సత్యాన్ని మనం గుర్తించాలి. అదే నిజమైన way of life. అదే game of life.

కనుక దైవత్వం ఒక ఆకారములో మనకు కనిపిస్తున్నదని మనము భావించరాదు. నిరాకార తత్వం నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్యశుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపిణం. అనిత గుణాములన్నీ అర్థం కాని పేర్లతో వుంటున్నాయి. అలాంటి అర్థం కాని తత్వాన్ని మనము నిరూపించటానికి వీలుకాదు. కనుకనే సత్యమే దైవం. search of truth is search of God. Truth is God. God is because truth is god. కనుక మన సత్యాన్వేషణే దైవాన్వేషణ. ఈ సత్యం మారనిది. కనుక అట్టి సత్యమార్గాన్ని మనము అవలంబించాలి. సత్యవాక్కును మనం పోషించాలి. సత్యజీవితాన్ని మనం గడపాలి. సత్యదేశంగా మార్చాలి. అదే యీనాటి విద్యార్థుల ప్రధాన కర్తవ్యము. విద్యతో బాటు విజ్ఞానం, విజ్ఞానంతో పాటు సుజ్ఞానం, సుజ్ఞానంతో పాటు ఆత్మజ్ఞానము, ఆత్మజ్ఞానముతో బాటు బ్రహ్మతత్వాన్ని గుర్తించి వర్తించి ఆనందాన్ని అనుభవించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.